సాక్షి
వికారాబాద్
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



నిధులు, నియామకాలు

నిధులు, నియామకాలు హామీలకే పరిమితమని.. సీఎం ప్రజలను మోసం చేస్తున్నారని గడ్డం ప్రసాద్ విమర్శించారు. 10లో▸



ర్యాలీ ఉద్రిక్తం

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవంటూ పరిగిలో కర్ణాటక వాసులు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. 10లో▸



మరోసారి ఆశీర్వదించండి

పట్టణ పరిధిలో ‘పైలట్ పాదయాత్ర’ పేరుతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రెండు రోజులు పాదయాత్ర కొనసాగించారు. 11లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



మోమిన్‌పేటలో కేంద్ర బలగాల కవాతు

మోమిన్‌పేట: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తూ కేంద్ర బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో మోమిన్‌పేట, ఏన్కతల, చీమల్‌దరి, మొరంగపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కల్గించే వారిపై నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరు గౌరవించాలని సూచించారు.

కరన్‌కోట్ పీఎస్‌లో ఓపెన్ హౌస్




ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: పోలీసులు వినియోగించే ఆయుధాలపై అవగాహన పెంచుకోవాలని తాండూర్ రూరల్ సీఐ రాంబాబు విద్యార్థులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని గౌతాపూర్ శివారులోని కరన్‌కోట్ పీఎస్‌లో అమర వీరుల వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు ప్రైవేట్ ఐటీఐ విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై క్షుణ్ణంగా వివరించారు. పీఎస్ రికార్డులు, కేసు నమోదు వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

108లో ఉద్యోగావకాశాలు

కందుకూరు: 108లో పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్, కోఆర్డినేటర్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంఆర్‌ఐలో పైలెట్స్, ఈఎంటీలుగా పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఎస్సీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పైలెట్ కోసం ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు బ్యాడ్జీ లైసెన్సు పొంది ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30, 31 తేదీల్లో హయత్‌నగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం 91542 48992, 83099 24615 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత



చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసివేసిన అర్చకులు

మొయినాబాద్: చంద్రగ్రహణం సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని శనివారం సాయంత్రం మూసివేశారు. అర్ధరాత్రి 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్ర గ్రహం ఉండడంతో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఆలయ అర్చకులు గర్భగుడి తలుపులు మూసివేశారు. గ్రహణం తరువాత ఆదివారం తెల్లవారు జామున ఆలయ సంప్రోక్షణ(శుద్ధి) చేసి స్వామివారికి ఏకాంత అభిషేకం, అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు అవకాశం కల్పిస్తామని ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు.

మైసిగండిలో..

కడ్తాల్: చంద్రగ్రహణం కారణంగా మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత ఆలయాన్ని శనివారం ఉదయం 11 గంటలకు ఆలయ అధికారులు మూసివేశారు. గ్రహణం పూర్తయిన అనంతరం ఆదివారం ఉదయం 8 గంటలకు ఆలయ సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం తిరిగి తెరవనున్నట్లు తెలిపారు.



తాండూరు: రోడ్‌షోకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ చరిత్ర గొప్పది

- పార్టీని గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు బహుమానం ఇవ్వాలి
- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్
- తాండూరు, పరిగిలో బస్సు యాత్ర
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవినీతిలో కూరుకుపోయారని పీసీసీ చీఫ్ రేవంత్ ధ్వజం

వికారాబాద్, తాండూరు, పరిగి: కాంగ్రెస్ చరిత్ర ఎంతో గొప్పదని అన్ని మతాలను, కులాలను కలుపుకొని దేశ పురోగతికి కృషి చేయడంలో ప్రధాన భూమిక పోషించిందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రెండో విడత బస్సు యాత్రను శనివారం తాండూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా తాండూరు, పరిగిలో ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. విద్యార్థులు, యువత బలిదానాలను చూసిన సోనియమ్మ తెలంగాణ ఇచ్చిందని.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి ఆమెకు బహుమానంగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. పరిగిలో రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

గుడిని మింగేటోళ్లు..

పరిగిలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే గుడిని, గుళ్లో లింగాన్ని మింగేటోడని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రయ్య కాంగ్రెస్ పార్టీలో చేశారు.



పరిగి: రోడ్‌షోలో మాట్లాడుతున్న డీకే శివకుమార్ చిత్రంలో రేవంత్‌రెడ్డి, టీఆర్ఆర్

ఉప్పెన మొదలైంది..

మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో ఒంటి చేతితో కాంగ్రెస్ గెలిపించిన డీకే శివకుమార్ తాండూరుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తాండూరులో కాంగ్రెస్ ఉప్పెన మొదలైందని తెలిపారు. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. తాండూరు ప్రజలకు మనోహర్‌రెడ్డి లాంటి వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థిగా దొరకడం ప్రజల అదృష్టమన్నారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు ప్రాణహిత చేవెళ్ల తీసుకొస్తే దాన్ని రద్దు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను జోగులాంబా జోన్‌లో వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పుష్పలీల, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, లాల్‌కృష్ణ, ఎర్రగడ్డపల్లి కృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాసంపత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌జాదవ్, డాక్టర్ సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

కొడంగల్ మీదుగా రేవంత్‌రెడ్డి

కొడంగల్ రూరల్: కర్ణాటక ఉప ముఖ్యమంత్రితో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు కొడంగల్‌లో శనివారం రాత్రి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. తాండూర్‌లో బస్సుయాత్ర ముగించుకొని కొడంగల్ మీదుగా పరిగి వెళుతున్న క్రమంలో రేవంత్‌రెడ్డి కొంత సమయం అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులకు, నాయకులకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస నాయకులు డికె.శివకుమార్‌కు, రేవంత్‌రెడ్డికి శాలువాలు కప్పుతూ కాంగ్రెస్ పార్టీ జిందాబాద్, కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటూ నినాదాలతో హోరెత్తించారు.

తాండూరు ఎమ్మెల్యే అమ్ముడు పోయిండు

ఓట్లేసి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలను మోసిన తాండూరు ఎమ్మెల్యే వందల కోట్లకు అమ్ముపోయాడని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తాండూరులోని ఇందిరాచౌక్‌లో వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మహరాజుల కుటుంబానికి చెందిన మాజీ మంత్రి మాణిక్‌రావు తాండూరును దశాబ్దాల క్రితమే అభివృద్ధి పథంలో నిలిపారన్నారు. మాణిక్‌రావు వల్లే తాండూరుకు పారిశ్రామిక గుర్తింపు లభించిందన్నారు. దశాబ్దాల క్రితమే వ్యాపార కేంద్రంగా వెలుగొందిందిందని తెలిపారు. నిన్నమొన్నటి వరకు గ్రూపులుగా విడిపోయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయులు వీధుల్లో కుమ్ములాడుకున్నారని, ఇప్పుడు మళ్లీ ఒక్కటయ్యారని ఎద్దేవా చేశారు. తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డిని 25 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు.

ఓటేసే మిషన్‌కు 41 ఏళ్లు

- బ్యాలెట్ స్థానంలో ఈవీఎంలు
- 2013 నుంచి వీవీ ప్యాట్‌ల వినియోగం

వికారాబాద్ అర్బన్: సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న కొద్దీ ఎన్నికల నిర్వహణలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు అక్షరాస్యులు, నిరక్షరాస్యులు ఇద్దరూ బ్యాలెట్ పేపరు వినియోగించి ఓటేసే వారు. ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాల వినియోగం ప్రారంభమై 41ఏళ్ల గడిచింది. ఎన్నో ఒడిదొడుకుల తర్వాత ప్రస్తుతం ఈవీఎం–వీవీ ప్యాట్‌లతో భారత ఎన్నికల సంఘం ఓటింగ్ నిర్వహిస్తుంది.

ప్రస్థానం ఇలా

- 1982 మే 19న కేరళ రాష్ట్రంలోని పరూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటిసారిగా ఈవీఎం వినియోగించారు.
- 1982–83 ఉప ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా పది స్థానాల్లోనూ ఈవీఎంల ద్వారా పోలింగ్ నిర్వహించారు.
- 1984 మార్చి 5న సుప్రీం కోర్టు ఈవీఎంను వినియోగించవద్దని ఆదేశాలిచ్చింది.
- 1988 డిసెంబర్‌లో కేంద్రం సెక్షన్ ‘61–ఎ’ను ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది.
- ఈ సవరణ 1989 మార్చి 15న అమల్లోకి వచ్చింది. సుప్రీం కోర్టు సమర్థించింది.
- ప్రభుత్వం 1990 జనవరిలో ఎన్నికల సంస్కరణ కమిటీ(ఈఆర్‌సీ)ని ఏర్పాటు చేసింది. దీని ప్రకారం 1990 ఏప్రిల్‌లో సాంకేతిక నిపుణుల కమిటీ ఈవీఎంల వాడకాన్ని సిఫారసు చేసింది.
- 1992లో సవరణలతో ఎన్నికల నియమావళి 1961 నిబంధనలను మార్చింది.
- 1998లో ఈవీఎంల వాడకంపై ప్రజామోదం లభించింది.
- 1999–2004 మధ్య వివిధ రాష్ట్రాల శాసన సభ ఎన్నికల్లో ఈవీఎంలను వాడారు.
- 2004–2014 మధ్య లోక్‌సభకు ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు.
- 2013 ఆగస్టు 14న ఎన్నికల నియమావళి 1961కి సవరణ చేసి వీవీ ప్యాట్‌లను అనుసంధానం చేయాలని నిర్ణయించారు.
- 2013 సెప్టెంబర్ 4న నాగాలాండ్‌లోని నాక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గానికి నిర్వహించిన ఉపఎన్నికలో తొలిసారిగా వీవీ ప్యాట్‌ను వినియోగించారు.
- 2013 అక్టోబర్ 8న దశల వారీగా వీవీ ప్యాట్‌లను వినియోగంలోకి తీసుకురావాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.
- 2013 నుంచి ఎన్నికల సంఘం వీవీ ప్యాట్‌లను వినియోగిస్తూ వస్తుంది.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం ఈవీఎంలు, వీవీ ప్యాట్లతోనే ఎన్నికలు నిర్వహించారు.



ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మృత్యువులోనూ వీడని స్నేహం

పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెను తగిలి ఇద్దరు రైతుల దుర్మరణం

దౌల్తాబాద్: కులాలు, గ్రామాలు వేరైనా పక్కపక్కనే పొలాలు ఉండటంతో ఆత్మీయంగా కలిసిమెలిసి సాగు చేసుకునే ఆప్త మిత్రులు మృత్యువులోనూ ఒక్కటిగానే వెళ్లిపోయారు. అడవి పందుల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెను తగిలి ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన దేవర్‌ఫసల్‌వాద్‌లో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నట్ట వెంకటప్ప(60) తన పదెకరాల పొలంలో వరి, శనగ సాగు చేస్తున్నాడు. ఇతని పొలం పక్కనే లొట్టికుంటతండాకు చెందిన చందర్‌నాయక్(62)కు సుమారు ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరూ కలిసి పంటలు సాగు చేస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి పొలం చుట్టూ ఏర్పాటు చేసిన కంచెకు విద్యుత్ షాక్ పెట్టి వచ్చారు. శనివారం ఉదయాన్నే ఇద్దరూ కలిసి వెళ్లారు. రాత్రి షాక్ పెట్టిన విషయాన్ని మర్చిపోయి తీగలు దాటేందుకు ప్రయత్నించి అక్కడికక్కడే మృతిచెందారు. కొద్ది గంటల తర్వాత చుట్టు పక్కల పొలాల రైతులు వెళ్లి చూడగా.. విగత జీవులుగా పడి ఉన్నారు. ఈ విషయం బాధిత కుటుంబ సభ్యులకు చెప్పడంతో గుండెలు బాదుకుంటూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. చందర్‌నాయక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు, వెంకటప్పకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌కుమార్ తెలిపారు.



చందర్‌నాయక్(ఫైల్)



నట్ట వెంకటప్ప(ఫైల్)

అభివృద్ధికే ఓటేయండి



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

- మరోసారి గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

బంట్వారం: అసత్య ప్రచారాలను నమ్మకుండా అభివృద్ధికే ఓటేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. శనివారం ఆయన కోట్‌పల్లి మండల పరిధిలోని మల్‌శెట్టిపల్లి, కంకణాలపల్లి, కరీంపూర్, నాగసాన్‌పల్లి, మోత్కుపల్లి తది తర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభి వృద్ధి, సంక్షేమ పథకాల ఘనత బీఆర్ఎస్ సర్కార్‌దేనని ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నియోజవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మరోసారి కారు గుర్తుపై ఓటేసి గెలిపిస్తే సమస్యలు లేకుండా అభివృద్ధి చేస్తాన్నారు. జిల్లాకు మెడికల్ కాలేజ్, ఆయూష్ ఆస్పత్రి, కుంగిన ఆర్వోబీ నిర్మాణానికి నిధులు తీసుకువచ్చానని గుర్తు చేశారు. మధ్యవర్తుల జోక్యం లేకుండానే లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేష్ యాదవ్, చంద్రకళ, పాండు రంగారెడ్డి, పద్మారెడ్డి, కవిత, ఎంపీటీసీ సభ్యుడు బందెయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ పార్టీలకు ఓటు వేస్తే అంతే

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: కందుకూరు వరకు మెట్రో రైలు రావాలంటే, మెడికల్ కాలేజీ నిర్మాణం జరగాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే సంక్షేమం సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అభివృద్ధిలో వెనక్కి వెళ్తామని అన్నారు. తన కోసం నెల రోజుల పాటు నాయకులు, కార్యకర్తలు పని చేసి గెలిపిస్తే ఐదేళ్ల పాటు అండగా ఉంటామని తెలిపారు. అంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ఎంపీపీ సునీతా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు అవగాహన అవసరం

- సందేహాల నివృత్తికి ఆన్‌లైన్ సెషన్ వినియోగించుకోవాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎన్నికల విధులపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. శనివారం తెలంగాణ రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులకు భారత ఎన్నికల సంఘం ఢిల్లీ నుంచి వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల విధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్ శ ర్మ, లింగ్యా నాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీఓలు విజయకుమారి, శ్రీనివాస రావు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులను చేపట్టాల్సి ఉంటుంద న్నారు. సందేహాల నివృత్తికి ఆన్‌లైన్ సెషన్ సద్వినియోగం చేసుకొని విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. మోడల్ కోడ్ పక్కాగా అమలు చేయాలని సమావేశాలు, బ హిరంగ సభలు, వాహనాలకు తప్పనిసరిగా అను మతులు పొందేలా చూడాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలన్నారు. కౌంటింగ్ సిబ్బందిని నియమించుకుని వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. నవంబర్ 3నుంచి చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ల ప్రక్రియ దాఖలైన నాటి నుంచి అభ్యర్థుల వ్యయ సమాచా రం ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అలకలు.. బుజ్జగింపులు!

కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు

- రెండో జాబితా ప్రకటనతో మంటలు
- రంగంలోకి అధిష్టానం పెద్దలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ రెండో జాబితా పలువురు ఆశావహులను నిరుత్సాహానికి గురిచేసింది. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడ్డ స్థానిక కార్యకర్తలను కాదని.. ప్యారచూట్ అభ్యర్థులకు టికెట్లు కేటాయించడంపై భగ్గుమంటున్నారు. ఎల్బీనగర్‌లో మధుయాష్కీగౌడ్, మహేశ్వరంలో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేరును ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం టికెట్ విషయంలో తీవ్ర పోటీ నెలకొంది. ముగ్గురు పోటీ పడగా టికెట్ దక్కని వారు కినుకవహించారు. టికెట్ ద క్కించుకున్న అభ్యర్థికి ఎట్టి పరిస్థితుల్లో సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నట్లు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగి బుజ్జగిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో పోటీ నుంచి వెనక్కి తగ్గుతారా.. అభ్యర్థి గెలుపునకు సహకరిస్తారా.. మరో పార్టీ గూటికి చేరుకుంటారా అనేది వేచి చూడాలి.

కేడర్‌తో ఆశావహుల సమాలోచనలు

మహేశ్వరం నియోజకవర్గంలో మొదటి నుంచి తీవ్రమైన పోటీ నెలకొంది. ఇక్కడి నుంచి బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతతో పాటు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి మొదటి నుంచి టికెట్ ఆశించారు. పారిజాతకు దాదాపు ఖరారైందని భావించిన నేపథ్యంలో అనూహ్యంగా మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పేరును ప్రకటించారు. అధిష్టానం నిర్ణయంపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆదివారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమై తమ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి భంగపడిన మరోనేత దేప భాస్కర్ రెడ్డి సైతం ఆర్కేపురం డివిజన్ స్వాగత్ గ్రాండ్‌లో ఆదివారం కార్యకర్తలు, అభిమానులతో సమావేశం కానున్నారు. టికెట్ దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కార్యకర్తల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం ఉదయం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నివాసానికి చేరుకుని ఆయన్ను బుజ్జగించారు. ఒకవైపు అసంతృప్తులను బుజ్జగిస్తూనే.. మరోవైపు ఇతర పార్టీల నేతలపై దృష్టి సారించారు. ఈ మేరకు తుక్కుగూడలోని మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్ నివాసానికి చేరుకుని మద్దతివ్వాలని కోరినట్లు తెలిసింది.

ఎల్బీనగర్‌లో నేతల అంతర్మథనం

గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆ తర్వాత ఆ పార్టీని వీడి.. అధికార పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నియోజకవర్గంలో మల్‌రెడ్డి రామిరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి కేడర్‌కు పెద్ద దిక్కుగా నిలిచారు. తమకే టికెట్ వస్తుందని చివరి వరకు వారంతా భావించారు. వీరితో పాటు ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ దంపతులు సైతం టికెట్ ఆశించారు. తీరా జాబితాలో పేరు లేకపోవడంపై వారంతా మండిపడుతున్నారు. బహిరంగ వేదికలపై విమర్శలు చేయకపోయినా అంతర్గతంగా ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ప్రచారాన్ని ముమ్మరం చేయడం గమనార్హం.



బంట్వారం: మాలసోమారంలో గడ్డం ప్రసాద్‌కుమార్‌ కూతురు అనన్య ప్రచారం



అనంతగిరి: రామయ్యగూడలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ఆనంద్‌ సతీమణి సబిత తదితరులు



పూడూరు: చన్గోముల్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సోదరి అర్చనారెడ్డి

ప్రచారంలో ఫ్యామిలీస్‌

జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థులు, అనుచరులు, పార్టీ కార్యకర్తలతో పాటు కుటుంబ సభ్యులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ఆయా పార్టీల మేనిఫెస్టోలను వివరిస్తూ ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.

– వికారాబాద్‌ నెట్‌వర్క్‌

క్లుప్తంగా

ఓంకారనాదం

శోభాయమానంగా పాంబండ గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్లలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానం శనివారం ఓంకారనాదంతో మార్మోగింది. పౌర్ణమి సందర్భంగా భక్తులు దేవస్థానం చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. ఈ ప్రదక్షిణలో వీరశైవ లింగాయత్‌ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్‌ పాల్గొన్నారు. అనంతరం రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఏఆర్‌ హెడ్‌ కానిస్టేబుల్‌పై లైగింక వేధింపుల కేసు

అనంతగిరి: వికారాబాద్‌ జిల్లా హెడ్‌ క్వార్టర్స్‌లో ఏఆర్‌ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింలు శుక్రవారం రాత్రి వికారాబాద్‌ పీఎస్‌ పరిధిలో ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు వికారాబాద్‌ టౌన్‌ పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సింలుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నీళ్లు, నిధులు, నియామకాలు

హామీలకే పరిమితం

- ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్‌
- నాడు రెండెకరాల ఆసామి .. నేడు బినామీల వారసుడు
- సీఎం, ఎమ్మెల్యేపై విరుచుకుపడిన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌



ధారూరు: కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నేతలు

ధారూరు: నీళ్లు, నిధులు, నియామకాలు కేవలం హామీలకే పరిమితమని.. అబద్ధపు హామీలిస్తూ సీఎం కేసీఆర్‌ ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్‌ వికారాబాద్‌ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌ కుమార్‌ విమర్శించారు. శనివారం ధారూరుకు చెందిన మైనార్టీ, బీజేపీ నాయకులు, మైలారం, రాంపూర్‌తండా నాయకులు పలువురు కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీలకు రిజర్వేషన్లు అధికారంలోకి వచ్చిన వెంటనే మరిచారన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియమకాల ఊసే లేదని విమర్శించారు. నోటిఫికేషన్ల విడుదల, కోర్టుకు వెళ్లి స్టే తేవడం, పేపర్‌ లీకులు చేసిన నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడడం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సీఎంకు తగినట్లుగా వికాబాద్‌ ఎమ్మెల్యే ఉన్నారని.. నాడు రెండెకరాల ఆసామి 300 ఎకరాల బినామీ ఆస్తులకు వారసుడయ్యాడని ఆరోపించారు. పదేళ్లుగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ మండల పరిధిలో నేటికీ కాంగ్రెస్‌ హయాంలో చేపట్టిన పనులే తప్ప కొత్తగా చేసిందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల మనుగడకు నిధులు ఇవ్వని ప్రభుత్వ తీరుతో సర్పంచులే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్‌ అసోషియేషన్‌ జిల్లా అధ్యక్షుడు జె.హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బసప్ప, సర్పంచ్‌ పాండునాయక్‌, పార్టీ నాయకులు ఇబ్రహీం, కిరణ్‌కుమార్‌, అశోక్‌, బుజ్జయ్యగౌడ్‌, మహ్మద్‌ బాబాఖాన్‌, ఆశం, రాథోడ్‌ దేవేందర్‌, కృష్ణ, హోబ్యానాయక్‌, దావూద్‌, రెడ్యానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకవాసుల ర్యాలీ ఉద్రిక్తం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

- కాంగ్రెస్‌కు ఓటేయొద్దంటూ పరిగిలో ప్లకార్డుల ప్రదర్శన
- అడ్డుకున్న హస్తం పార్టీ శ్రేణులు
- పోలీసుల తీరుపై ఆగ్రహం



పరిగిలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న కర్ణాటక వాసులు

పరిగి: కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవంటూ పరిగిలో కర్ణాటక వాసులు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం బస్టాండ్‌ నుంచి గాంధీ చౌక్‌ మార్గంలో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీగా నిర్వహిస్తుండగా.. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ శ్రేణులు భారీగా తరలివచ్చి అడ్డుకున్నారు. పోలీసులు తమను నిలువరించడంపై హస్తం పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కర్ణాటక ప్రజలు ఇక్కడ ర్యాలీ నిర్వహిస్తుంటే బందోబస్తు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారు. ఈ క్రమంలో కర్ణాటకవాసులు, కాంగ్రెస్‌ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమంది కన్నడిగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉన్న కొద్ది మందిని హస్తం శ్రేణులు నిలదీయగా.. తమది కర్ణాటక రాష్ట్రం కోట్రికె గ్రామమని చెప్పారు. నిత్యం భోజనంతో పాటు రూ.300 ఇస్తామంటే మొత్తం 21 మందిమి వచ్చామని చెప్పడంతో.. కాంగ్రెస్‌ కార్యకర్తలు వారిని వదిలేశారు.

ఓటమి భయంతోనే కుట్ర

తమకు ఓటమి తప్పదని గ్రహించిన బీఆర్‌ఎస్‌ నేతలు.. డబ్బు ఆశచూపి అమాయక ప్రజలను తీసుకువచ్చి ఆందోళనలు చేయిస్తున్నారని కాంగ్రెస్‌ నాయకులు మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఎలాంటి అనుమతి లేకుండా కర్ణాటక ప్రజలు వచ్చి ఇక్కడ నిరసన ర్యాలీలు చేస్తుంటే పోలీసులు వారికి బందోబస్తు ఇవ్వడం విడ్డూరమన్నారు. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగమేనని వాగ్వాదం చేశారు.

పథకాలకు పుట్టినిల్లు తెలంగాణ

కాంగ్రెస్‌ హామీలు నీటిమీది రాతలు

- బీజేపీకి డిపాజిట్లు దక్కవు
- బీఆర్‌ఎస్‌తోనే పేదలకు న్యాయం
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాదారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాల పుట్టినిల్లు తెలంగాణ అని.. రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కొజ్జవనంపల్లి, కద్చర్ల, మాదారం, మీనపల్లికలాన్‌ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ పాలనలో బీటీ రోడ్డు లేని గ్రామమే లేదన్నారు. కాంగ్రెస్‌, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కాంగ్రెస్‌ హామీలన్నీ నీటిమీది రాతలని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థులకు ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని విమర్శించారు. తాను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని మరో సారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ ప్రశాంత్‌గౌడ్‌, వైస్‌ ఎంపీపీ బందయ్యగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్‌, రత్నం, ఆనంద్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, పర్మయ్య, అంజయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

పెద్దేముల్‌: మండల కేంద్రంలో పీఎస్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఎంపీపీఎస్‌లో చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు ఈ నెల 13 నుంచి 25 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింలు అన్ని గదులకు తాళాలేసి వెళ్లిపోయారు. ఈ నెల 26న పాఠశాల పునఃప్రారంభమవ్వడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వచ్చి చూడగా ఆఫీస్‌ రూంతో పాటుగా పలుగదుల తాళాలు పగులగొట్టి దర్వాజలు ధ్వసం చేసి కనిపించాయి. గుర్తు తెలియని దుండగులు ఆఫీస్‌ రూంలో బీరువాల తాళాలు పగులగొట్టి ట్యాబ్‌ ఎత్తుకెళ్లారు. దీంతో హెచ్‌ఎం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి పంచనామా చేశారు. పోలీస్‌ స్టేషన్‌ పక్కనే ఉన్న పాఠశాలలో దొంగతనం జరగడంతో విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.3.36లక్షల నగదు సీజ్‌



నగదును చూపుతున్న ఎస్‌ఐ భరత్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: ఎలక్షన్‌ కోడ్‌ అమలులో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నిత్యం గస్తీ కాస్తున్నారు. శనివారం చేపట్టిన తనిఖీల్లో కస్తూర్‌పల్లి చెక్‌పోస్టు వద్ద రూ.3.36లక్షల నగదు పట్టుకున్నారు. కర్ణాటక బార్డర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తుల్లో ఒకరి వద్ద రూ.1.36లక్షలే, మరో వ్యక్తి వద్ద రూ.2లక్షలు పట్టుబడ్డాయి. ఇప్పటివరకు కొడంగల్‌ పీఎస్‌ పరిధిలో మొత్తం రూ.7.76లక్షల నగదు పట్టుబడిందని ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు. నగదును సీజ్‌ చేసి రిటర్నింగ్‌ అధికారికి అప్పగించినట్లు ఆయన వెల్లడించారు.

యాచారం మాజీ సర్పంచ్‌ మృతి



యాదయ్య (ఫైల్‌)

యాచారం: కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, యాచారం మాజీ సర్పంచ్‌ తెరటి యాదయ్య(68) మృతిచెందారు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. యాదయ్య భార్య లక్ష్మమ్మ యాచారం ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌ నాయకులు లక్ష్మమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి ప్రకటించారు.

సొంత గూటికి మాజీ ఎమ్మెల్యే

ఎన్నికల ముగిసిన వెంటనే క్రియాశీలక రాజకీయాలకు దూరం: నారాయణరావు



కాంగ్రెస్‌ కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, మాజీ కౌన్సిలర్‌ శ్రీనివాస్‌

తాండూరు: తాండూరు మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు సొంతగూటికి చేరుకున్నారు. శనివారం కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌, పీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి తాండూరులో రెండో విడత బస్సు యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి నివాసమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, డీసీసీబీ మాజీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్లు, పలువురు బీఆర్‌ఎస్‌ నేతలు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే క్రియాశీలక రాజకీయాలకు రిటైర్మెంట్‌ తీసుకుంటానని ప్రకటించారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌ గెలిపించేందుకు పనిచేస్తానన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్‌ పార్టీలోనే తన కుటుంబం కొనసాగుతూ వచ్చిందన్నారు.

ఉరేసుకుని టెన్త్‌ విద్యార్థి ఆత్మహత్య



గురుబ్రహ్మాచారి (ఫైల్‌)

ధారూరు: పొలం వద్దకు వెళ్తున్నానని తల్లికి చెప్పిన బాలుడు చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగారంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బాబాచారి, సరోజినిల మూడో కుమారుడు గురుబ్రాహ్మ చారి(15) పెద్దేముల్‌ మండలం మంబాపూర్‌ సమీపంలోని జ్యోతిబాపూలే పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన బాలుడు హాస్టల్‌కు వెళ్లడం లేదు. ఇదే విషయమై తల్లిదండ్రులు ప్రశ్నించగా తాండూరుకు వెళ్లి సామగ్రి తెచ్చుకుని మధ్యాహ్నం వెళ్తానని సమాధానం ఇచ్చాడు. ఉదయం పొలానికి వెళ్తున్నానని చెప్పి అక్కడే చింత చెట్టుకు ఉరేసుకున్నాడు. కాసేపటికి పశువులను మేపేందుకు పొలానికి వెళ్లిన తండ్రి బాబాచారి కొడుకు మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు.

తండ్రి, కూతురు అదృశ్యం



కమలాకర్‌(ఫైల్‌)



నౌషిత(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి కూతురుతో కలిసి వెళ్లిపోయాడు. ఈ సంఘటన బాలాపూర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్సై మహేందర్‌ తెలిపిన ప్రకారం.. బాలాపూర్‌ గ్రామానికి చెందిన జి.శ్రీదేవికి ఏడేళ్ల క్రితం కమలాకర్‌(29)తో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కమలాకర్‌ తరచూ భార్యతో గొడవపడుతూ.. ఈ నెల 24న రాత్రి తాగిన మైకంలో భార్యపై చేయి చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం కమలాకర్‌ తన కుమార్తె నౌషిత(2)తో కలిసి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య శ్రీదేవి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్‌ పీఎస్‌లో గాని 87126 62366 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

కాంగ్రెస్‌ గూటికి సిద్ధంకి?

అబ్దుల్లాపూర్‌మెట్‌ : పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు, కౌన్సిలర్‌ సిద్ధంకి కృష్ణారెడ్డి కాంగ్రెస్‌ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సిద్ధంకి కృష్ణారెడ్డి కొంతకాలంగా అటు కిషన్‌రెడ్డితో.. ఇటు పార్టీతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచిరెడ్డిని ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్‌ నాయకులు పార్టీ సమావేశాల నిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ పెద్దఅంబర్‌పేట పట్టణ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడిగా కొనసాగుతున్న సిద్ధంకి పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేపట్టకుండా తటస్థంగా ఉంటూ వస్తున్నారు. దీంతో మంచిరెడ్డిపై అలకబూనిన సిద్ధంకి కృష్ణారెడ్డిని ఇదే అవకాశంగా భావిస్తున్న కాంగ్రెస్‌పార్టీ కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు పావులు కదుపుతోంది. శుక్రవారం రాత్రి కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల రెండో జాబితాలో మల్‌రెడ్డిరంగారెడ్డి పేరు ఉండడంతో రెట్టింపు ఉత్సాహంలో ఉన్న మల్‌రెడ్డి అనుచరులు శనివారం సిద్ధంకి కృష్ణారెడ్డితో సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. ఈసారి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్‌ నేతలు బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటూ వస్తున్న సిద్ధంకిని కాంగ్రెస్‌కు గూటికి తీసుకుంటే తమకు కలిసివస్తుందన్న ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్‌ పార్టీలో తాను చేరే విషయమై రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇస్తానని సిద్ధంకి కాంగ్రెస్‌ నేతలకు తెలిపినట్లు సమాచారం. గతంలో ఒకే పార్టీలో ఉన్నప్పటికీ సిద్ధంకి కృష్ణారెడ్డి, మల్‌రెడ్డిరంగారెడ్డి ఉప్పు, నిప్పులా ఉన్న విషయం తెలిసిందే. అలాంటి వ్యక్తులు ఇప్పుడు కలిసి ప్రయాణం చేయనున్నారనే ప్రచారం పెద్దఅంబర్‌పేటలో జరుగుతోంది.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం

చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీమ్‌భరత్‌



కాంగ్రెస్‌లో చేరిన వారితో భీమ్‌ భరత్‌

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్‌, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో భీంభరత్‌ సమక్షంలో శనివారం ఊరేళ్ల గ్రామానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు గ్రామ కమిటీ అధ్యక్షుడు సునుగంటి కుమార్‌ ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్‌ గాలి వీస్తోందని.. అందుకే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌, నారాయణ, అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ జెండా ఎగురవేస్తాం

షాబాద్‌: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్‌ జెండా ఎగురవేస్తామని పామెన భీంభరత్‌ అన్నారు. మండల పరిధిలోని నాగర్‌గూడలో లక్ష్మారావుగూడకు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు కిష్టయ్య, అనంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డిలు పీసీసీ రాష్ట్ర సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాణిక్యంగౌడ్‌, బాల్‌రాజ్‌ పాల్గొన్నారు.

అవినీతి బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి...

అవినీతి, నియంతృత్వ దోపిడీ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్‌, బీజేపీలను ఓడించాలని చేవెళ్ల కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్‌ అన్నారు. శనివారం పోతుగల్‌ గ్రామంలో సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్‌, చేవెళ్ల యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు పెంటారెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పాటల ఆడియో ఆవిష్కరణ..

షాబాద్‌ నుంచి చేవెళ్ల విజయభేరి సభకు వెళ్లిన భీంభరత్‌ సతీమణి పామెన జ్యోతి ఆయన పాటల ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగుచెందారన్నారు. రానున్న ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్‌ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీ సెల్‌ అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్‌, మల్లేశ్‌, శ్రీరాంరెడ్డి, పాల్గొన్నారు.

హామీ ఇస్తేనే పనిచేస్తా

హస్తం టికెట్‌ ఆశించి భంగపడిన వసంతం

చేవెళ్ల: కాంగ్రెస్‌ చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్‌ ఆశించి భంగపడిన అభ్యర్థి సున్నపు వసంతం పార్టీకి దూరంగా ఉండటంతో పార్టీ పెద్దలు బుజ్జగించే పనిలో ఉన్నారు. శనివారం ఆయన నివాసానికి పార్లమెంట్‌ ఇన్‌చార్జి వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్‌, పలువురు నాయకులు ఆయనతో చర్చించారు. పార్టీ అండగా ఉంటుందని వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని కలిసి పనిచేస్తే పార్టీ సముచిత స్థానం కల్పిస్తోందని బుజ్జగించారు. పార్టీకోసం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా సున్నపు వసంతం పార్టీ పెద్దలతో మాట్లాడిస్తేనే తాను పార్టీలోనే ఉంటానన్నారు. పార్టీ అధిష్ఠానం తనకు స్పష్టమైన హామీ ఇస్తే వారి మాటకు కట్టుబడి ప్రచారంలో పాల్గొంటానన్నారు. ఈ విషయంలో తన అభిమానులు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తానన్నారు. అనంతరం వేంనరేందర్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో చర్చించి మాట్లాడిస్తానని హామీ ఇచ్చారు.